కథానిక

# కవిరాజ్ సందర్శనం

## వేదుల మీనాక్షీదేవి

రాత్రి యెనిమిది గంటలైంది. సుందర్రావు ఆరు బయట వెన్నెట్లో పడుకున్నాడు. అతని చెవులలో విద్యార్థి పాడిన కవిరాజ్ గీతం యింకా వినబడుతూనే వుంది. ఆ విద్యార్థి యెంతబాగా పాడాడు! అతడు పాడతాడనే విషయమే తనకు తెలియదు. ఆ గొంతుకలో జీవంవుంది. ఆ గొంతుకకీ కవిరాజ్ గీతానికీ సరిగ్గా అతికింది. బంగారానికి పరిమళం అబ్బినట్లుందనుకున్నాడు సుందర్రావు.

సుందర్రావు బి. యే. ఆఖరు సంవత్సరం చదువుతున్నాడు. జూనియరు విద్యార్థులు సీనియర్స్‌కి వీడ్కోలు విందు చేశారు ఆవాళ సాయంత్రం. అప్పుడు పాడాడు ఓవిద్యార్థి కవిరాజ్ గీతాన్ని.

సుందర్రావుకి చిన్నప్పటినుండీ తెలుగు భాష అన్నా, తెలుగు కవులన్నా చాలా అభిమానం. ప్రబంధాలన్నీ చదివాడు. నూతన రచనలూ చదివాడు. నూతన పద్ధతిలో గీతాలల్లుతాడు.

నవీన రచయితలలో కవిరాజ్ మంచిపేరు సంపాదించాడు. ప్రాచీన రచనలు, నవీన రచనలు దృష్టిలో పెట్టుకుని, ఏఒక్క మార్గం కాకుండా "పాత కొత్తల మేళవింపులతో" కవిత్వం అల్లుతాడు కవిరాజ్. అదే అతనిలోని ప్రత్యేకత. కవిత్వం చాలా హృదయంగమంగా వుంటుంది. సుందర్రావు నాకర్షించిందా కవిత్వం. రకరకాల విషయాలలో ఆ కవి కనబరచిన అభిప్రాయాలు సుందర్రావుని ముగ్ధుణ్ణి చేశాయి. కవిరాజ్ పద్యాలెన్నో కంఠస్థం చేశాడు సుందర్రావు. సుందర్రావేకాదు, ఎందరో నేర్చుకున్నారు. రేడియోలలో పాడుతున్నారు. కవిరాజ్ గీతాలు రికార్డు చేయబడ్డాయి.

ఇంత పేరుపొందిన కవిరాజ్ సుందర్రావు మనస్సులో పీఠం వేసుకుని కూర్చున్నాడు. కవిరాజ్ గీతాలు వింటూంటే సుందర్రావుకి నిద్రాహారాలక్కర్లేదు! ఎంత దూరం అయినా సరే వెడతాడు ఎవరైనా ఆ గీతాలు పాడుతుంటే!

సుందర్రావు మనస్సు ఆనందంతో నిండిపోయింది. తాను కవిరాజ్ రచనలు చదవడమేకాని యింతవరకూ ఆయన్ను చూడలేదు. కాని, కవిత్వంలో ఏమి ఆ పోకడలు! ఏమి ఆ పదాలు! ఏమి ఆ భావాలు! ఎలాంటి హృదయాలనూ కదిలించేస్తాయి. ప్రతీ మానవుని మనస్సును రంజింపజేస్తుంది ఆ కవిత్వం.

కవిరాజ్ మనస్సూ మాటా సహజంగా చాలా సున్నితమైనవై యుండాలి. ఎరువు తెచ్చిపెట్టుకున్నవైతే అంత చక్కగా చెప్పడం కష్టం. అస్వాభావికత యెక్కడో అక్కడ కనబడి తీరుతుంది.

కవిరాజ్ గురించి ఊహించుకుంటున్నాడు సుందర్రావు తనలో.

"కవిరాజ్ సజ్జనుడు. మృదు స్వభావుడు. మితభాషి. భార్యాభర్తలకు చాలా అన్యోన్యం. ప్రబంధాలలోని నాయికా నాయకులవలె వారు తమ ఆరామంలో తిరుగుతూ వుంటారు. ఆమె పువ్వులుకోసి యిస్తూంటే ఆయన ఆమె తలలో ఆ పువ్వుల నలంకరిస్తూంటాడు. ఆయనకు జీవకోటియందు అపరిమితమైన ప్రేమ. జీవకోటేకాదు. "మృచ్ఛకటిక"లోని చారుదత్తునివలె చెట్టునున్న పువ్వుకోసం కొమ్మ వంచడానికి కూడా సందేహిస్తాడు. పువ్వుకాని, కాయకాని కోయవలసి వచ్చినప్పుడు తల్లినుండి బిడ్డను వేరు చేస్తున్నట్లు బాధపడే సరళ హృదయుడు. నడుస్తుంటే కాలికింద గడ్డిపువ్వులు నలుగుతాయేమోనని భయం. కవిరాజ్ కవిత్వంలో ఈ లక్షణాలు కనబడతాయి.

ఇలా ఏవో ఏవో ఊహించుకుంటున్నాడు సుందర్రావు. ఓ కునుకు వచ్చింది.

మూడు అంతస్తుల మేడ. లోపల పెద్దపెద్ద సావడులు, గదులు. లోపల పెద్దతోట. తోటనిండా పూలమొక్కలు, ఫలవృక్షాలు. మధ్యగా ఒక సరస్సు. తెల్లని బాతులు, తామర పువ్వులు, తామరాకులతో చూడ ముచ్చటగావుంది సరస్సు.

అక్కడక్కడ గచ్చుతిన్నెలు. ఒక గచ్చుతిన్నె మీద ఒక స్త్రీ, ఒక పురుషుడు కూర్చునివున్నారు. ఇద్దరూ అచ్చంగా రవివర్మ బొమ్మలలో లాగ వున్నారు. తెల్లగా పొడుగ్గా వున్నారు. పురుషుడు బిళ్ళగోచి పోసిన గ్లాస్కో పంచ, లాల్చీ తొడుక్కున్నాడు. మధ్య పాపట. జుట్టు ఉంగరాలు తిరిగి ఒత్తుగా ఉంది. ముఖంలో మందహాసం. ఆమె ముదర రంగు చీర, లేత రంగు రవిక ధరించింది. జారుముడి పువ్వులతో వుంది. ముఖాన చిన్న బొట్టు. కలకలలాడుతూవుంది ఆమె.

పెరట్లో ఆవులున్నాయి. సంపన్న గృహస్థుని లాగ వున్నాడు. పాడి, పంట వుంది. లోపల వృద్ధదంపతులున్నారు. కవిరాజ్ తలిదండ్రులు కాబోలు. తండ్రికి గోష్పాదమంత పిలక. మోకాలు దిగని పంచ. తల్లికి కొప్పు. అడ్డబాస, కాళ్ళకి అందెలు. కచ్చాపోసి చీర. రూపాయకాసంత బొట్టు. సాక్షాత్తు పార్వతీపరమేశ్వరుల్లా వున్నారా వృద్ధదంపతులు. సుందర్రావు మనస్సులో నమస్కారం చేశాడు వారికి. "కవిరాజ్ అదృష్టవంతుడు. "సుఖులై తలిదండ్రులుఁగూడి దేవియున్ దేవరవోలెనుండి యిలుదీర్పఁగ కాపురమొప్పువానికిన్" అనుకున్నాడు సుందర్రావు.

ఇంతలో మెలకువ వచ్చింది సుందర్రావుకి. ఆ మేడా లేదు. ఆ కవిరాజ్ లేడు. తన యింటి పెరట్లో పడుకుని వున్నాడు తను. కలగన్నాననుకున్నాడు. "కలైతే మాత్రం యేమి? ఒక్క మాటైనా కవిరాజ్‌తో మాట్లాడితే తృప్తిగా వుండేది" అనుకున్నాడు.

"కవిరాజ్ దర్శనం చేసుకుని వస్తే?" అనిపించింది సుందర్రావుకి. ఇన్నాళ్ళుగా తనకా ఆలోచన కలగనందుకు తనను తను నిందించుకున్నాడు. ఉదయం బయల్దేరితే సాయంత్రానికి రావచ్చు. ప్రయాణం నిశ్చయం చేసుకున్నాడు. ఇక నిద్ర పట్టలేదు. ఊహలమీద ఊహలతో తెల్లవారిపోయింది.

అక్కడికి నలభై మైళ్ళుంది కవిరాజ్ నివాసగ్రామం. బస్సుప్రయాణం...

• • •

"ఇదే కవిరాజ్ గారి యిల్లు" అంటూ సుందర్రావుని అక్కడ విడిచి వెళ్ళిపోయాడు రిక్షావాలా. ఆకాశంయెత్తు మేడ. లోపలకి వెళ్ళే జనం వచ్చేజనం. వీధిగుమ్మంలో కార్లు, రిక్షాలు, బళ్ళూ!

"దేశంలోని జనం అంతా కవిరాజ్ గడప తొక్కి తీరవలసిందే. సన్మానాలకనీ, ఉపన్యాసాలకనీ, సినీమాలకి పాటలు, మాటలు వ్రాయమనీ తిరుగుతూవుంటారు. గుమ్మాలలో పడిగాపులు పడివుంటారు జనం" అనుకుంటూ వీధిమెట్లు ఎక్కాడు సుందర్రావు. సింహద్వారం దగ్గిర నిజంగా సింహమంత మనిషి ఒకడున్నాడు. "ఎవరు కావాలి?" అని అడిగాడు.

"కవిరాజ్ గారు కావాలి. ఈ చీటీ తీసుకువెళ్ళి చూపించు" అంటూ విజిటింగు కార్డు యిచ్చాడు సుందర్రావు. ఓ నిముషంలో వాడు తిరిగివచ్చి "బాబుగారు మిమ్మల్ని రమ్మన్నారు" అంటూ లోపలకి తీసుకువెళ్ళాడు. హాల్లో యెదర కుర్చీలో కూర్చున్న కవిరాజ్‌ని చూపించి వెళ్ళిపోయాడు.

కవిరాజ్ ఆరు అడుగుల యెత్తు. అంతకి తగ్గ లావుగా వున్నాడు. నల్లని నలుపు, పెద్ద ముఖం. చిన్న కళ్ళు. పంచె కట్టుకున్నాడు. పలకరంగు కోటు తొడుక్కున్నాడు. పైన తెల్లని కండువా బెత్తెడు వెడల్పున మడతగా పెట్టి మెడకు చుట్టినట్లు వేసుకున్నాడు. పెద్దాపురం సిల్కు కండువా తలపాగా చుట్టాడు.

సుందర్రావు తల తిరిగినట్లయింది. తన కళ్ళని తను నమ్మలేకుండా వున్నాడు. తను ఊహించిన కవికీ, యీయనకీ పోలికేలేదు. ధృతరాష్ట్రుని కౌగలి కోసం తయారు చేయబడ్డ యినుప భీముని విగ్రహం జ్ఞాపకం వచ్చింది ఆయన్ను చూడగానే సుందర్రావుకి.

నమస్కారంచేసి అక్కడేవున్న బెంచీమీద కూలబడ్డాడు. కొంతసేపటికి తమాయించుకున్నాడు.

"మనిషి మన వూహాప్రకారం వుంటాడనుకోవడం చాలా పొరబాటు. కవిరాజ్ యింత మోటైనా ఆయన కవిత్వం యెంత మృదు మధురంగా వుంది! ఆయనకు మాత్రం అందంగా వుండాలని వుండదూ? అది సాధ్యమా? ఏంచేస్తాడు పాపం" అనిపించింది సుందర్రావుకి. జాలికూడా వేసింది.

"ఏం అలా వున్నారు? వొంట్లో ఏమైనా సుస్తీగా వుందా" అన్న కవిరాజ్ మాటలతో ప్రకృతావస్థలో పడ్డాడు సుందర్రావు. అంత

మహానుభావుని ముందు మర్యాదగా ప్రవర్తించ వందుకు సిగ్గనిపించింది అతనికి.

"ఏంలేదండి. ఆరోగ్యంగానే వున్నాను" అన్నాడు సుందర్రావు. కవిరాజ్ మనస్సెంత మంచిది! ఎంత ఆదరం! ఎంత మధురంగా పలక రించాడు! అనుకున్నాడు.

"తమ పేరు ప్రఖ్యాతులు విన్నాను. తమ దర్శనం చేసుకుందుకు వచ్చాను" అన్నాడు వినయం వుట్టి పడుతూ సుందర్రావు.

"చాలా శ్రమ తీసుకున్నారన్న మాట నాకోసం" అన్నాడు కవిరాజ్.

"ఎంతమాట! శ్రమ యేమిటి? తమరు లోకం కోసం పడే శ్రమలో యిది లెక్కా? మీ శ్రమలో ప్రజలు ఆనందపు టంచులు చూస్తారు. మీ కా శక్తి భగవంతుడు ప్రసాదించాడు. నేడు నా జన్మ ధన్యమైంది." అన్నాడు సుందర్రావు కవిరాజ్ ముఖాన్ని వెయ్యి కళ్ళతో చూస్తూ. మళ్ళీ తన జన్మలో చూడలేక పోతాడేమోనన్న భావం అతనిలో ద్యోతకం అవుతోంది.

"మాకు శ్రమ యేమిటి. తెల్లవారితే యిదే వృత్తి; ఇది ఒకరికోసం కాదు. కేవలం స్వార్థానికే" అన్నాడు కవిరాజ్.

తను యిన్నాళ్ళనుండి అనుకున్న ఆ సరళత్వం, ఆ నిరాడంబరం కళ్ళయెదుట ప్రత్యక్షంగా చూడ గలుతున్నా ననుకున్నాడు సుందర్రావు.

"తమవంటివారలా అనకపోతే మా అంతవారు లేరంటారా? అది మీ సౌజన్యాన్ని తెలియ జేస్తుంది. అయితే తమకోసం సినిమావాళ్ళూ, పత్రికా విలేఖరులు, ఫోటోగ్రాఫర్లు వస్తూంటా రనుకుంటా పిలుచుకుపోడానికి" అన్నాడు సుందర రావు. అతనిలో ఔత్సుక్యం వెల్లివిరుస్తోంది.

"రాకేం, అంతా వస్తూంటారు వారికి నాతో పని వున్నప్పుడు." నిర్లిప్తతగా అన్నాడు కవిరాజ్.

"ఎంతమాట. తమతో వారికి కాకపోతే వారితో తమకు పనేమిటి? తమకు సన్మానం జరిగిందని విన్నాను. నిజమేనా? అసలు మనవాళ్ళని మన వాళ్లు గౌరవించరు. అదే మరో దేశంలో అయితే బ్రహ్మరథం పట్టుతారు" అన్నాడు సుందర్రావు.

"సన్మానం జరిగినమాట నిజమే. కవిరాజ్ అనే బిరుదు పొందాను. నా పేరు కాదు కవిరాజ్, నా బిరుదుతోనే నన్ను వ్యవహరిస్తారు."

"తమవంటివారిని సత్కరించడం తమను సత్క రించుకోవడమే అన్న మాట. తమ గొప్పతనాన్ని అర్థం చేసుకోగలిగారు ప్రజలు అనుకోవాలి. అంతే. నిజంగా మీ కలంలో అమృతం కాదుటండీ చిందు తుంట. ఆ అమృతసేవనంతో ప్రజలు మృత్యుం జయులౌతున్నారు" అన్నాడు సుందర్రావు. తనకి కవిరాజ్‌తో మాట్లాడే మహదవకాశం లభించిం దన్న ఆనందం ముఖంలో కనబడుతోంది.

"అంతా ఆ ధన్వంతరి మహాత్మ్యం. నా కల్వంలో యేమి వుంది?" అన్నాడు కవిరాజ్.

సుందర్రావుకి కనబడుతున్నది కవిరాజ్ గేయాలే. కాని యెదర కుర్చీలో కూర్చున్న కవి రాజ్ కాదు. ఆయన మాటలు కూడా విన్నట్టు లేదు సుందర్రావు.

"ఇంతటి విద్యను మీ చేతిగోటిలో యిముడ్చు కున్న మహానుభావులు మీరు" ఆనందంతో గొంతు బొంగురుపోయింది సుందర్రావుకి.

"అది మా యింటివిద్య. మా తాతముత్తాతల నాటినుండి వస్తున్నదే. నా యిద్దరు కుమారులూ యీ విద్యయందు ప్రవీణులే. కాని ఇంగ్లీషు బంధాలో ప్రవేశపెట్టాను. విశాఖపట్నంలో చదువుతున్నారు వారు" అన్నాడు కవిరాజ్.

"అదిగదీ. అలా చెప్పండి. వంశంలో వున్న విద్య గనుకనే రాణించింది యింత గొప్పగా. నేర్చుకోవాలంటే యెన్నాళ్ళకి యీ నైపుణ్యం వస్తుంది మామూలువాళ్ళకి! అయితే మీ సతీమణి కూడా యీ విద్యలో ప్రవీణులని విన్నాను." అన్నాడు సుందర్రావు.

"అబ్బే, ఆమె కిదేమీ తెలియదు. అదీగాక ఆమె కాలంచేసి పదేళ్ళయింది." నిట్టూర్చాడు కవిరాజ్ పోయిన భార్య స్మృతిపథాన పడగానే.

"అయ్యో తెలియక కష్టపెట్టాను. క్షమిం చండి" అన్నాడు సుందర్రావు నొచ్చుకుంటూ.

"ఫరవాలేదు. ఆపేక్షగా చూడడానికి వచ్చిన మిమ్మల్ని గురించి మరొక అభిప్రాయం లేదు నాకు" అన్నాడు కవిరాజ్.

"అవతల జనం కనిపెట్టుకుని వున్నారు తమ కోసం" అన్నాడు సుందర్రావు.

"ఏ రోజూ అలాగే వుంటారు. మీలాంటివారే అరుదు" అన్నాడు కవిరాజ్ గౌరవపూర్వకంగా.

"అవున్లెండి. తమవంటి వారికోసం కాకపోతే మరెవరికోసం వెదతారు ప్రజలు! సూదంటురాయి లాగా మీ విద్య వారిని ఆకర్షిస్తోంది! మీ మనసు వెన్నపూస! మీ మాటలు తేనెతేటలు! ఏమి పండితులండీ మీరు! మీరు యిటీవల వ్రాసిన ఖండకావ్యంలోని చచ్చిపోయిన మీ ఆవుదూడ కోసం లోకం దుఃఖించింది కదుటండీ!" ఒణుకుతున్న పెదవులతో అన్నాడు సుందర్రావు.

"ఆవుదూడ చావలేదే!"

"చావని దూడని చచ్చినట్లు, మరణించిన భార్యని సజీవగా వున్నట్లు ఎలా వ్రాయగలిగారండీ! జరిగినవి వ్రాయడం సులభమే. కాని, జరగనివి జరిగినట్లు వ్రాయడం వ్రాసి ప్రజల మన్ననలను పొందగలగడం చాలా కష్టం! గొప్ప విషయం! కవిరాజ్, మీకు నా నమశ్శతాలు" అంటూ లేచి నిలబడి చేతులు జోడించాడు నమస్కారపూర్వకంగా సుందర్రావు.

కవిరాజ్ ముఖంలో ఒక్క క్షణం ఆశ్చర్యం కనబడింది. మరుక్షణంలోనే చిఱునవ్వు మెరసింది.

"సుందర్రావుగారూ, నేను వైద్యంలో కవిరాజ్‌ని. మీరు చూడదలిచిన కవిరాజ్ కవి. వెనక వీధిలో సరిగ్గా యీ యింటికి వెనుక వుంది మీ కవిరాజ్ యిల్లు" అంటూ వీధి గుమ్మందాకా వచ్చి సాగనంపాడు సుందర్రావుని కవిరాజ్.

---

స్కెచ్

# "అడవి మృగం"

ద్రోణంరాజు కృష్ణమోహన్

"ఆ అమ్మాయి చూడు! ఆ అలంకారం అదీ ఎలా వున్నదో!" అటువైపు చూస్తూ అన్నాడు రఘు. మూర్తి అటు తిరిగి చూశాడు. పల్లెటూరి పడుచు నీళ్ళబిందె బుజాన పెట్టుకు నడుస్తోంది.

"నిజమే. చాలా మోటు అలంకారమే. కాని ఎంత అందగత్తె!"—వర్ణించాడు మూర్తి తనకు పరిచయమైన కవితాపదజాలం ప్రయోగించి.

"ఎంత రతీదేవిలా వుంటే మాత్రం ఏంలాభం! పొట్ట చీరిస్తే అక్షరం ముక్క లేదు. అలంకారం చూస్తే పరమ అసహ్యం. అబ్బ యీ పల్లెటూరి ఆడవాళ్లు—"

తన విసుగంతా చూపించాడు యిహ మాట్లాడలేక.

"చదువులేకపోతే మానె. ఆ అలంకారమన్నా తీసెయ్యకూడదూ!" మూర్తి అభిప్రాయం.

"అంతమాత్రాన ఒరిగేదేమిటీ! చదువు ముఖ్యం. కనీసం స్కూల్ ఫైనల్ ఐనా అయివుండాలి. ఆ అమ్మాయి ఐదో క్లాసన్నా చదివిందో లేదో?" రఘు ఆ అమ్మాయిని గురించి అంత గట్టిగా ఎందుకు మాట్లాడుతున్నాడో తెలియలేదు మూర్తికి.

"పోనీ కనుక్కోమన్నావా ఎంతవరకూ చదువుకున్నదో?" మిత్రుడి సందేహం తీర్చుదామన్న సదుద్దేశంతో మూర్తి అడిగాడు.

"అబ్బే. ఊరికే అడుగుతున్నాను—నిజంగా వెళ్ళి అడక్కురోయ్! అసలే కొంటి వెధవవి నువ్వు!"

"పోనీలే. ఆడగనులే. కరణంగారమ్మాయి అని విన్నాను!" మూర్తి జవాబిచ్చాడు. ఇద్దరూ మరో కాస్సేపు కబుర్లు చెప్పుకుని పెళ్ళివారింటికి తిరిగి బయలు దేరారు చీకటి పడే వేళకి.

భోజనాల దగ్గర ఆ అమ్మాయి ప్రత్యక్షమైంది. నెయ్యి వడ్డిస్తోంది. మెడలో నాలుగు పేటల గొలుసు, ఒంటిపేట గొలుసులు రెండు, చేతులకు మూడు జతల బంగారపు గాజులు, కాళ్ళకు పట్టా గొలుసులు, యింకా ముక్కు పుడక, రవ్వల దుద్దులు, అన్నీ వున్నాయి. తలంటి పోసుకున్న జుట్టు కాబోలు, ముడివేసుకుంది. సన్నని నడుమూ విశాలమైన వక్షస్థలం, పొడుగాటి బలమైన శరీరం